కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

కాజీపేట, నవంబర్ 3 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ డిమాండ్ చేశారు. కాజీపేటలో మండలాధ్యక్షుడు జంపాల రమేశ్ అధ్యక్షతన ఆదివారం డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను తిరిగి కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతున్నదని, మోదీ ప్రభుత్వం పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయడం సరికాదన్నారు. వెంటనే యువతకు ఉపాధి కల్పించాలని, లేకుంటే ఆందోళలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మదన్‌చారి, శివరాత్రి కరుణాకర్, యువన్, శ్రీను, హరీశ్, యేసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి

దామెర, నవంబర్ 3 : ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని వైష్ణవి ఎంపికైందని ఎంఈవో లకావత్ రాజేశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 3,4,5 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు వైష్ణవి ఆదివారం వెళ్లింది. కార్యక్రమంలో పీడీ దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పెన్షనర్లు ధర్నాలను విజయవంతం చేయాలి'

నయీంనగర్, నవంబర్ 3 : ఈ నెల 5న భీమదేవరపల్లి, 6న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాని సీతారాం అన్నారు. హనుమకొండలోని ఓ స్కూల్‌లో హనుమకొండ, పరకాల, భీమదేవరపల్లి ఏస్టీవోల ఆధీన పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 3డీఏలు, పీఆర్సీలు, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు విద్యాదేవి, అబ్దుల్ రహీం, జ్యోతిరాణి, వేణుగోపాల్, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట, నవంబర్ 3: కాజీపేట రైల్వే డీజిల్ లోకో షెడ్డు (డీఎల్ఎస్)లో ఆదివారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎన్నికల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వేద ప్రకాశ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 4, 5, తేదీల్లో జరుగబోయే వన్ యూనియన్ వన్ ఇండస్ట్రీ ఎన్నికల్లో ప్రతి రైల్వే కార్మికుడు ఓటు వినియోగించుకోవాలన్నారు. నిత్యం రైల్వే కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యూనియన్ నాయకులు రాజేశ్వర్‌రావు, యాదగిరి, ఎస్‌కే జానీ, నరేశ్‌యాదవ్, గుర్రం నాగరాజు, ఐలయ్య, దేవేందర్, సాయిలు, లఖన్‌సింగ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పరకాలలో పడకేసిన అభివృద్ధి

- పాత పనులు పూర్తయిత లేవు.. కొత్త పనులు చేస్తలేరు..
- నత్తనడకన వంద పడకల దవాఖాన
- ఆగిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- ముందుకు సాగని పరకాల-రాజీపేట డివైడర్ పనులు

అసంపూర్తిగా ఉన్న వంద పడకల దవాఖాన

ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్‌వెజ్ మార్కెట్

పరకాల, నవంబర్ 3 : ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. పరకాల పట్టణ అభివృద్ధి పరిస్థితి. ప్రజా పాలన, సుస్థిర అభివృద్ధి అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ప్రగతి పడకేసింది. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో అట్టహాసంగా శంకుస్థాపనలు చేసిన కొత్త పనులు కూడా నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. వంద పడకల దవాఖాన, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, రాజీపేట రోడ్డు సెంట్రల్ లైటింగ్, శ్మశాన వాటిక నిర్మాణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిచిపోయాయి. అంతే కాకుండా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శంకుస్థాపన చేసిన డిగ్రీ కళాశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంపై పరకాల వాసులు పెదవి విరుస్తున్నారు.

సాగుతున్న హాస్పిటల్ నిర్మాణ పనులు..

పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పరకాలలో నూతనంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించింది. ఆ సమయంలో నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నత్త నడకన సాగుతున్నాయి. దీంతో మెరుగైన వైద్యం అందుతుందని ఆశపడిన డివిజన్ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్కడి పనులు అక్కడే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. రూ.కోటితో శ్మశాన వాటిక పనులు చేపట్టారు. ప్రస్తుతం మరికొన్ని నిధులు కేటాయిస్తే పనులు పూర్తవుతాయి. అదేవిధంగా సుమారు రూ.7కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టగా రూ.6కోట్ల మేర పనులను పూర్తి చేశారు. మిగతా పనులు ముందుకు సాగడం లేదు. అలాగే పరకాల నుంచి రాజీపేట వరకు డివైడర్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

మంత్రి శంకుస్థాపనలు చేసినా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పరకాలలో సుమారు రూ.12కోట్లతో పలు పనులకు శంకుస్థాపన చేశారు. నూతన మున్సిపాలిటీ ఆవరణలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి అమృత్ పథకం–2లో భాగంగా రూ.11.74కోట్ల పనులు, రూ.5కోట్లతో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాగా, శంకుస్థాపనలు జరిగి మూడు నెలల కావస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

దవాఖానను త్వరగా అందుబాటులోకి తేవాలి..

పరకాల డివిజన్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నాలుగు మండలాల ప్రజలకు వైద్య సదుపాయాలకు కేంద్రంగా పరకాల ఉంది. నిత్యం ఎంతో మంది పేదలు వైద్యం కోసం పరకాలకు వస్తారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంలో జాప్యం కావడంతో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి వెంటనే ఆస్పత్రిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– సూర రాజేందర్, పరకాల

కుంటు పడుతున్న అభివృద్ధి..

పనులు నిలిచిపోవడంతో పరకాల అభివృద్ధి కుంటుపడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ముందుగా నిలిచిపోయిన పనులకు నిధులు కేటాయించడంతో పాటు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

– నక్క చిరంజీవి, పరకాల

కాజీపేటలో మృతదేహం గుర్తింపు

కాజీపేట, నవంబర్ 3 : కాజీపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మృతదేహాన్ని గుర్తించినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో చనిపోయాడు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని, బ్లూ కలర్ జీన్స్, ఆరెంజ్ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్ర పరిచామని చెప్పారు. ఎవరైనా బంధువులుంటే కాజీపేట పోలీస్‌స్టేషన్ లేదా 8712685122, 8712509781 సంప్రదించాలని కోరారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కాజీపేట, నవంబర్ 3 : బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి కాజీపేట పట్టణంలో తాము ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సందీప్ సింగ్ (22) ఏడాది క్రితం స్నేహితులతో కలిసి కాజీపేటకు వచ్చాడు. పట్టణంలో తన స్నేహితులతో అద్దె ఇంట్లో నివాసముంటూ రైల్వే క్యాంటీన్ కాంట్రాక్టర్ వద్ద పనిలో చేరి రైల్వే స్టేషన్‌లో సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పనికి పోకుండా రూంలోనే ఉండి ఉదయం నుంచి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. తర్వాత అదే రూంలో ఉరేసుకొన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు వివరించారు. కాగా, ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

నడికూడ, నవంబర్ 3 : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు గట్టు మల్లయ్య ఆదివారం తాటి చెట్టు పైనుంచి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కల్లు గీయడం కోసం తాడి చెట్టు ఎక్కగా అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

లారీ ఢీకొని విరిగిన కమాన్

రోడ్డుపై ఒరిగిన కమాన్

మడికొండ, నవంబర్ 3 : మడికొండ మీదుగా ధర్మసాగర్, రింగ్ రోడ్డు వైపు తరచూ భారీ వాహనాలు వెళ్తుండడంతో వాటిని నియంత్రించేందుకు మడికొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కమాన్‌ను ఆదివారం ఉదయం లారీ ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, శుక్రవారం పోలీసులు కమాన్‌ను ఏర్పాటు చేయగా రెండు రోజులకే లారీ ఢీకొట్టింది. కమాన్ ఏర్పాటు చేసిన పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ఘటన జరిగిందని పలువురు చెబుతున్నారు. కాగా, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కడిపికొండ పీహెచ్‌సీ తనిఖీ



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మడికొండ, నవంబర్ 3 : కడిపికొండలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం డీఎం అండ్ హెచ్‌వో అప్పయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వ ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగులకు కావాల్సిన మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్, సూపర్‌వైజర్ వెంకటస్వామి, సిబ్బంది వల్లభాయ్, సురేశ్, స్టాఫ్ నర్సు సునీత, అటెండర్స్ విజయ, రాజు పాల్గొన్నారు.

వేలాడుతున్న కరెంటు తీగెలు



గంగిరేణిగూడెం శివారులో పొలాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

శాయంపేట, నవంబర్ 3 : విద్యుత్ తీగెలు రోడ్డు పక్కన, పొలాల్లో మృత్యు పాశాలుగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. రైతులు నిత్యం పనులు చేసే పొలాల పరిధిలో స్తంభాలు వంగిపోయి ఉండడం పరిపాటిగా మారింది. జోగంపల్లి నుంచి కొప్పులకు వెళ్లే దారిలో చలివాగు వద్ద ప్రధాన రోడ్డు పక్కనే కరెంటు తీగెలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నట్లు చెప్పారు. భారీ వాహనాలు వెళ్తే తీగెలు తగిలే ప్రమాదముందంటున్నారు. విద్యుత్ అధికారులకు తెలిపినా సరిచేయడం లేదని చెబుతున్నారు. గంగిరేణిగూడెం వెళ్లే దారిలో పొలాలపై భారీ విద్యుత్ వైర్లు వేలాడుతున్నట్లు చెప్పారు.

రోడ్డు పక్కనే మద్యం దందా

- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు

రూంలో తాగి పడేసిన మందు బాటిళ్లు

రోడ్డుపైనే మద్యం తాగుతున్న మందుబాబులు

నయీంనగర్, నవంబర్ 3 : కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం బ్రిడ్జిపై రాత్రివేళ జోరుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గుడుంబా సైతం అక్కడ దొరుకుతుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరైనా ఇదేంటని అడిగితే దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అంతా ఆ సారూ కనుసన్నల్లోనే..

లోకల్ పోలీసులు అటువైపు కన్నెత్తి చూడరని, ఒకవేళ అటువైపు పోతే ఎందుకు వెళ్తున్నారని పైఅధికారి నుంచి ఫోన్లు వస్తాయని ప్రచారం సాగుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే నువ్వు నాకు చెప్పేవాడివి అయ్యావా? అంటూ మీ పెద్ద సారూకు అన్నీ తెలుసు మూసుకుని పో అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. మద్యం తాగేందుకు కెనాల్ చుట్టూ ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు సమాచారం.

గంజాయి బ్యాచ్‌తో యమా డేంజర్..

అటువైపు పోలీసులు రారు అనే ధైర్యం అటు మందుబాబులతో పాటు ఇటు గంజాయి బ్యాచ్‌కు అలవాటైపోయింది. గతంలో ఈ ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లను పట్టుకుని కేసులు నమోదు చేసిన పోలీసుల ప్రస్తుతం నిఘా తగ్గించడంతోనే ఇదంతా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై సీఐ రవికుమార్‌ను వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, ఇలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

రేవంత్‌రెడ్డి.. ఎగవేతల సీఎం

- అభయ హస్తం కాదు.. భస్మాసుర హస్తం
- రైతుల వద్దకు వెళ్లే దమ్ముందా.. సీఎంకు సవాల్
- సీఎం కుటుంబానికి, కోటరీకి వెలుగులు నింపారు
- బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వరంగల్, నవంబర్ 3 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో తెలంగాణ ప్రజల్లో ఆనందం కరువైందని, సీఎం కుటుంబానికి, కోటరీకి తప్పా ఎవరికీ లాభం కలుగలేదని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం హనుమకొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని చేతకాని సర్కారు అని, ముఖ్యమంత్రి ఎగవేతల రేవంత్‌రెడ్డిగా మారారని, తెలంగాణను భ్రష్టు పటించారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను కప్పిపుచ్చే చర్యలు దుర్మార్గమైనవని అభివర్ణించారు. బ్లాక్‌మెయిలింగ్, భూదందాలు, సెటిల్‌మెంట్లు, కోటరీకి దోచిపెట్టడం, వసూళ్లపైనే సీఎం దృష్టి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ అభయ హస్తం ఇప్పుడు శూన్య హస్తం, భస్మాసుర హస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పరిస్థితి పొయ్యిలో పడినట్లయిందన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, పంటలకు బోనస్, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు హామీలను అమలు చేయని రేవంత్‌రెడ్డికి రైతుల వద్దకు వెళ్లే దమ్ముందా అని ప్రశ్నించారు. రెండు నెలల్లో లక్షా ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వని సీఎం నాతో నిరుద్యోగుల వద్దకు వస్తారా? అని సవాల్ విసిరారు. 11 నెలలు అవుతున్నా అభయహస్తం గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, నాయకులు తోపుచర్ల మధుసూదన్‌రావు, కందగట్ల సత్యనారాయణ, నర్మెట్ల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అరకొర వసతులు.. ఇన్‌చార్జి వైద్యులు

- సమస్యల వలయంలో కమలాపూర్ 30 పడకల దవాఖాన
- నిధులు కేటాయించని వైద్యవిధాన పరిషత్
- హాస్పిటల్‌ను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రజలకు అందని మెరుగైన వైద్యం

కమలాపూర్‌లోని 30 పడకల దవాఖాన

కమలాపూర్, నవంబర్ 3 : మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రికి ఇన్‌చార్జి డాక్టర్లే దిక్కయ్యారు. దవాఖానలో ఆరుగురు డాక్టర్లు, పది మంది స్టాఫ్ నర్సులు, 9మంది శానిటేషన్ సిబ్బంది పని చేస్తున్నారు. పరకాల ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు నరేశ్, విజిత, వరుణ్, రవి, ప్రియాంక, భానుప్రసాద్ కమలాపూర్ 30పడకల హాస్పిటల్‌లో డిప్యూటేషన్‌పై విధుల్లో చేరారు. పది మంది స్టాఫ్ నర్సుల్లో ఐదుగురు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆస్పత్రిలో సరైన వసతులు కల్పించకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందించడం ఇబ్బందిగా మారిందంటున్నారు. వైద్యవిధాన పరిషత్ నిధులు కేటాయించకపోవడం, ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వైద్య కోసం 20కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

మెరుగైన వైద్యం కోసం హనుమకొండ, పరకాల, హుజూరాబాద్, జమ్మికుంట వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడి ప్రజల విజ్ఞప్తి మేరకు పీహెచ్‌సీని 2022లో అప్‌గ్రేడ్ చేసి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చింది. కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా నూతన భవనాన్ని నిర్మించింది. మండలంలోని 24గ్రామాల ప్రజలతో పాటు ఎల్కతుర్తి, ఇల్లందకుంట, హసన్‌పర్తి మండలాలకు చెందిన ప్రజలు వైద్యకోసం కమలాపూర్‌కు వస్తున్నారు. పాముకాటు, కుక్కకాటు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌కు చికిత్స చేయడంతో పాటు డెలివరీలు చేస్తున్నారు. ప్లేట్‌లెట్ కౌంట్, టీబీ తెమడ పరీక్ష, ఈసీజీ, ఎక్స్‌రే, రక్తహీనత, హెచ్‌ఐవీ, హెపటైటిస్ ఏ–బీ, ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులు చేస్తున్నారు. అయినా వసతుల లేమితో రోగులు మెరుగైన వైద్యం కోసం 20కిలోమీటర్ల దూరంలోని ఇతర పట్టణాలకు వెళ్తున్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత..

దవాఖానకు పూర్తిస్థాయిలో డాక్టర్లను కేటాయించకపోవడం, గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు లేకపోవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడ్ అయి రెండేళ్లు దాటుతున్నా జీవో విడుదల చేయకపోవడంతో నిధుల కేటాయింపు జరగడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలితే ప్రైవేట్ హాస్పిటళ్ల వెళ్తే వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

నిధులు రావడం లేదు..

దవాఖానకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇన్‌చార్జి డాక్టర్లతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతిరోజు 150కిపైగా ఓపీ అవుతోంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో చేరిన మూడు వందల మంది రోగులకు వైద్య సేవలు అందించాం. అన్ని రకాల పరీక్షలు చేసేందుకు వసతులు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు రాకపోవడంతో సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ నరేశ్, సూపరింటెండెంట్

నయీం జుబేర్‌ను పరామర్శిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

కార్యకర్తలకు అండగా ఉంటా..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట, నవంబర్ 3 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కాజీపేట పట్టణానికి చెందిన నయీం జుబేర్‌ను ఆయన పరామర్శించారు. ఆయన వెంట పులి రజినీకాంత్, రఘు, ప్రవీణ్, రాకేశ్‌యాదవ్ ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీల ఎంపికపై ఎమ్మెల్యే రేవూరి ఆగ్రహం

ఆత్మకూరు, నవంబర్ 3 : గ్రామాల్లో సమావేశాలను ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేయాల్సి ఉండగా, ఇష్టానుసారంగా వేశారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట పడుతున్న వారికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం కల్పించాలని చెప్పినా తన మాటలను ఖాతరు చేయకుండా కమిటీలను ఎన్నుకోవడం సరికాదని తీవ్రంగా మందలించారు. గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలు ఎవరో తన దగ్గర లిస్టు ఉందని చెప్పారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధిపై పట్టింపులేని ఎమ్మెల్యే రేవూరి

పరకాల, నవంబర్ 3 : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల అభివృద్ధిపై పట్టింపు లేదని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి అన్నారు. పట్టణంలోని ఎఫ్‌జే ఫంక్షన్ హాల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేవూరికి పరకాల నియోజకవర్గంపై అవగాహన లేదని, అభివృద్ధి చేస్తానని మాటలే చెబుతున్నారు కానీ ఆచరించడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తున్నారే కానీ, కొత్తగా ఎలాంటి నిధులు తీసుకువచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో టఫెడ్‌కో నుంచి రూ.25కోట్లతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశారన్నారు. కొన్ని వార్డుల్లో పనులు పెండింగ్‌లో ఉండగా, కమీషన్ల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే వాటిని నిలుపివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అవగాహన లేని ఎమ్మెల్యే చెప్పుడు మాటలతో వార్డుల సమగ్రాభివృద్ధిని అడ్డుకుంటున్నాడని, పాలకవర్గం ఆమోదించిన పనులు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ఏదైనా ఇతర పనులు చేపట్టాలంటే నూతనంగా నిధులు చేటాయించాలన్నారు. అంతేగాని గతంలో వార్డులకు కేటాయించిన పనులను రద్దు చేసి ఇతర వార్డులకు కేటాయించొద్దన్నారు. రాజకీయ దురుద్దేశంతో కొన్ని వార్డులపై కక్షగట్టినట్లు వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి ప్రకాశ్‌రెడ్డి, కౌన్సిలర్లు దామెర మొగిలి, శనిగరపు రజిని, గొర్రె స్రవంతి, పాలకుర్తి గోపి, నాయకులు చందుపట్ల తిరుపతిరెడ్డి, శనిగరపు నవీన్, దుప్పటి సుజయ్ రానా, హమీద్ పాల్గొన్నారు.

అభ్యర్థులకు వెల్‌కం కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, చైర్‌పర్సన్ శోభారాణి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మడికొండ, నవంబర్ 3 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మడికొండలోని మహిళా ప్రాంగణంలో టైలరింగ్ కోర్సు ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంగణం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్లను వేయించేందుకు కృషి చేస్తామన్నారు. అంబేద్కర్ ఈ క్లాసెస్ ఫర్ నర్స్ కోర్స్ ఇప్పిస్తామని చెప్పారు. అంతకుముందు అభ్యర్థులకు వెల్‌కం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, వస్కుల శ్రీను పాల్గొన్నారు.

నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, నవంబర్ 3 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌లో వినతులు అందజేయాలని పేర్కొన్నారు. అధికారులు సకాలంలో గ్రీవెన్స్‌కు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, నవంబర్ 3 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డాక్టర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కల్లు మండువా జంక్షన్, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, భీమారం రోడ్డు, అరుణోదయ కాలనీ ఏరియాలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్జీవోస్ కాలనీ –2, వెంకటేశ్వర కాలనీ, శ్యామల గార్డెన్, అమరావతి నగర్ ఏరియాల్లో, బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు న్యూ బస్టాండ్ రోడ్డు, హనుమకొండ చౌరస్తా మెయిన్ రోడ్డు, టైలర్ స్ట్రీట్, గాంధీనగర్, కాకాజీ కాలనీ, కాంగ్రెస్ భవన్ ఏరియాలు, ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫాతిమానగర్, అష్టలక్ష్మీనాగ్రానంద్ దర్గా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.